తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరిసుభాష్‌రెడ్డి, మాజీ మంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, చిరుమర్తి

ఏడాది పాలన..ఎడతెగని వేదన

మొదటిపేజీ తరువాయి...

ఘనత వహించాడని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత చింతా ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణిని ఎండగట్టారు. వీడియో స్లైడ్స్ ప్రదర్శిస్తూ రేవంత్‌రెడ్డి తీరును బట్టబయలు చేశారు.

> మోసం చేయడం మాకలవాటు.. మోసపోవడం ప్రజలకలవాటని నిస్సిగ్గుగా చెప్పిన మహా మోసగాడు రేవంత్‌రెడ్డి. టీడీపీలో ఉన్నప్పుడు సోనియాను బలిదేవత అని, ఇప్పుడు మూడు రంగుల జెండా కప్పుకొని ధర్మదేవత అంటున్నవ్. ఏడో గ్యారెంటీ కింద ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పి యథేచ్ఛగా హక్కుల హననానికి పాల్పడుతున్నవ్. - హరీశ్

రైతుబంధు ఎగ్గొట్టి నిండా ముంచిండు

అధికారంలోకి రాగానే మూడు పంటలకు పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు రెండు పంటలకు కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టి రైతులను నిండా ముంచారని హరీశ్ మండిపడ్డారు. 11 విడుతల్లో రూ.72 వేల కోట్లను కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కోసం విడుదల చేసిందని, రైతుబీమా కోసం రూ.10 వేల కోట్లు ఇచ్చిందని, మొత్తంగా రూ.82 వేల కోట్లు రైతులు, రైతు కుటుంబాల కోసం కేటాయించిందని, ఇది రేవంత్ సర్కార్ చేసిన రుణమాఫీ కంటే నాలుగు రెట్లు ఎక్కువ అని హరీశ్‌రావు గుర్తుచేశారు. వానకాలం, యాసంగికి రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేసి, ఇప్పుడు సంక్రాంతి తర్వాత ఇస్తామని చెప్పడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు.

చీరకాదు..జాకెట్ పీసు కూడా ఇవ్వలే

'బతుకమ్మ పండుగకు కేసీఆర్ ఒకటే చీర ఇస్తున్నడు.. మేం వచ్చినంక రెండు చీరలు ఇస్తం అన్నవు.. ఇప్పుడు కనీసం జాకెట్ పీసు కూడా ఇవ్వకుండా ఆడబిడ్డలను మోసం చేసినవ్' అంటూ హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆడబిడ్డలకు ఇచ్చిన మాట తప్పితే అంతకంటే పాపం మరోటి లేదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని దుయ్యబట్టారు. భూములు, ప్లాట్లకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని చెప్పి, ఇప్పుడు ఏఆర్ఎస్ (ఎనుముల రెగ్యులరైజేషన్ స్కీం) ద్వారా రూ.15 వేల కోట్ల వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క గతంలో చెప్పినట్టు, ప్రజలకు ఇచ్చిన మాటకు అనుగుణంగా ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు.

పోటీపరీక్షల విషయంలో ట్రిపుల్ స్టాండర్డ్

ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన కాంగ్రెస్, మొదటి ఏడాదిలో కనీసం పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా మొండిచెయ్యి చూపిందని హరీశ్ తూర్పారబట్టారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్‌గా చేశారని ఎద్దేవాచేశారు. పోటీపరీక్షల వాయిదా విషయంలో ట్రిపుల్ స్టాండర్డ్స్ తీసుకున్నారని దుయ్యబట్టారు. 'తలకు మాసినోళ్లు పరీక్షలు వాయిదా వేయాలంటున్నరు..పరీక్షలు రాయనోళ్లు, సదువు రానోళ్లే ఇట్లా అంటరు అని ఉద్యోగార్థులను అవమానించినవ్. నిరుద్యోగుల ఆందోళనకు దిగొచ్చి గ్రూప్-2ను వాయిదా వేసినవ్.. అంటే తలకుమాసినోడు ఎవరు రేవంత్? సమాధానం చెప్పు?' అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేపట్టిన కులగణన సర్వేపై అభాండాలు వేసిన రేవంత్, ఇప్పుడు చేసున్నదేమిటని నిలదీశారు. 'సర్వేలో నీకు ఎంత భూమి ఉన్నది..సైకిల్ ఉన్నదా? మీ కొడుకు ఏం ఉద్యోగం చేస్తడు? వంటి సంబంధంలేని ప్రశ్నలు అడగడంలో ఔచిత్యమేమిటి?' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఒకట్రెండు అక్రమ కట్టాలను కూల్చివేస్తే ప్రతిపక్షంలో ఉండి గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు హైడ్రా పేరిట విధ్వంసానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు.

పోలీసులతోనూ కన్నీరు..

'నేను పోలీసు కుటుంబం నుంచి వచ్చిన.. మీ బాధలు నాకు తెలుసు.. ఏక్ పోలీసింగ్ తెస్తా అని ఎన్నికల సభల్లో మొసలి కన్నీరు కార్చిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఇచ్చిన మాట నెరవేర్చాలని అడిగిన పాపానికి పోలీసులకే కన్నీరు పెట్టించిండు' అని హరీశ్‌రావు నిప్పులుచెరిగారు. 39 మంది పోలీసుల ఉద్యోగాలు తీసేసి వారి కుటుంబాలను రాచిరంపాన పెడుతున్నారని విమర్శించారు.

గల్లీగల్లీకో బెల్ట్‌షాప్

మద్యం అమ్మకాల విషయంలోనూ సీఎం ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని హరీశ్ ఆక్షేపించారు. బీఆర్ఎస్ పాలనలో ఊరికో బెల్ట్ షాపులు ఉన్నాయని గోబెల్స్ ప్రచారంచేసి, ఇప్పుడు గల్లీకో బెల్ట్ షాపు తెరిచారని విమర్శించారు. అప్పుడు మద్యం వద్దని పద్యం చెప్పి.. ఇప్పుడు అదనంగా రూ.10 వేల కోట్ల అదనపు ఆదాయం రాబట్టాలని ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. మద్యం అమ్మకాల లక్ష్యాన్ని చేరుకోని అధికారులను తొలగిస్తున్నారని, ఇప్పటికే 30 మంది ఎక్సైజ్ సీఐలకు చార్జిమెమోలు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కాళేశ్వరంపై గోబెల్స్ ప్రచారం

కోటి ఎకరాలకు నీరందించేందుకు కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరంపై సీఎం రేవంత్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ మండిపడ్డారు. 'ఓ వైపు ప్రాజెక్టు కూలిపోయిందని చెప్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు మరోవైపు మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం 20 టీఎంసీలు, మూసీలోకి 5 టీఎంసీలు తరలించాలని, రంగనాయక్ సాగర్ నుంచి లక్షా పదివేల ఎకరాలకు నీళ్లిస్తామని సిగ్గులేకుండా మాట్లాడుతున్నడు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

> కేసీఆర్ 11 విడతల్లో 72 వేల కోట్లు రైతుబంధు కోసం ఇచ్చిండ్రు. 10 వేల కోట్ల రైతుబీమా కలుపుకొంటే మొత్తం 82 వేల కోట్లు.. ఇది నువ్విచ్చిన రుణమాఫీ కంటే నాలుగురెట్లు ఎక్కువనే విషయం గుర్తుపెట్టుకో రేవంత్‌రెడ్డీ..ఎన్నికల ముందు రైతులు, కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తానని చెప్పినవ్. ఇప్పుడు ఎవరికియ్యాలో వాళ్లిద్దరే తేల్చుకోవాలంటున్నవ్.. వానకాలం, యాసంగికి రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేసినవ్. ఇప్పుడు నింపాదిగా సంక్రాంతి తర్వాత అనడంలో ఆంతర్యమేంది?. - హరీశ్

> ఏడాదిలో ఒక్క ఇల్లు కూడా కట్టకుండా వందలాది ఇండ్లను నేలమట్టం చేసినవ్.. తన ఇంటిని కూల్చుతుంటే పసిపాపను వాటర్ బాటిల్ కూడా తెచ్చుకోనివ్వని అమానవీయాన్ని ఈ తెలంగాణ ప్రజానీకం చూసింది. ఇప్పుడు హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్ పేరుకుపోయింది. - హరీశ్

సిగ్గులేకుండా కండువాలు కప్పుతున్నరు..

పార్టీ ఫిరాయించినోళ్లను రాళ్లతో కొట్టాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గ అన్న చందంగా కండువాలు కప్పుతున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి కడుపులో తలకాయ పెట్టి వారిని చేర్చుకున్నారని విమర్శించారు. ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతో ఏడాది మార్కు పాలన సాగించడం ఆయనకే చెల్లిందని దెప్పిపొడిచారు. ఒక చేత్తో పూలు, మరో చేత్తో రాళ్లు విసిరే నేర్పరితనం రేవంత్ సొంతమని ఎద్దేవాచేశారు.

శిలాఫలకాలపై సీఎం బొమ్మలా?

బీఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫకాలపై రేవంత్ అనవసర రాద్ధాంతం చేశారని, అప్పుడు కేసీఆర్ పేరు వద్దన్న ఆయన ఇప్పుడు పేరుతో పాటు ఏకంగా తన బొమ్మకూడా పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని హరీశ్ నిలదీశారు. పేపర్ యాడ్స్ విషయంలోనూ ఇదే తీరున మాటమార్చారని, చిన్న కార్యక్రమాలకు డబుల్ పేజీ యాడ్స్ ఇస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

మూసీపై మాట మార్పు..

మూసీపై ముఖ్యమంత్రి పదే పదే మాట మారుస్తూ ప్రజలను ఏమారుస్తున్నారని హరీశ్ విమర్శించారు. 'మొదట ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.5 లక్షల కోట్లు ఖర్చవుతుందని అన్ని చెప్పిండు. మళ్లీ ఇటీవల నేను అలాచెప్పలేదు అని నిస్సిగ్గుగా, నిస్సంకోచంగా అన్నడు.. సలహాదారుల నియామకంలోనూ ఇట్లనే వ్యవహరించిండు.. సలహాదారులు ఎందుకు?, వారికి క్యాబినెట్ హోదా ఎందకు ? అని నాడు రేవంత్‌రెడ్డి కోర్టుకు పోయిండు. ఇప్పుడు కేసు కోర్టులో ఉండగానే నిస్సిగ్గుగా ఉల్లంఘిస్తున్నడు. తనకు నచ్చిన నాయకులను సలహాదారులుగా పెట్టుకున్నడు' అంటూ నిప్పులుచెరిగారు.

పచ్చటి పొలాల్లో ఫార్మావద్దన్నందుకు..

అభయహస్తం మ్యానిఫెస్టోలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏడో గ్యారెంటీగా హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, మూడు నిర్బంధాలు, ఆరు అణచివేతలు అన్నట్టుగా పాలన సాగిస్తున్నారని హరీశ్ ధ్వజమెత్తారు. పచ్చటి పొలాల్లో ఫార్మా కంపెనీలు పెట్టి చిచ్చు పెట్టవద్దని ఎదురుతిరిగిన లగచర్ల గిరిజన రైతులను చితకబాదారని మండిపడ్డారు. అర్ధరాత్రి లగచర్లలో పోలీసులు చేసిన అరాచకాన్ని ప్రపంచం మొత్తం చూసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజనిర్ధారణ కోసం వెళ్లిన ప్రజాసంఘాలను అడ్డుకొని లగచర్లను పాకిస్థాన్ బార్డర్‌లా మార్చారని, చిన్నారులు, గర్భిణులు, మహిళలు అన్న కనికరం లేకుండా దాష్టీకాలకు పాల్పడడం రేవంత్ మార్క్ పాలనకు అద్దంపట్టిందని నిప్పులు చెరిగారు. న్యాయం కోసం రోడ్డెక్కిన నిరుద్యోగుల వీపులపై లాఠీలు ఝుళిపించిన ఘనత నిఖార్సైన ప్రజాస్వామవాది రేవంత్‌రెడ్డికే దక్కిందని ఎద్దేవాచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నక్సలైట్లు ఉంటే బాగుంటదని మాయ మాటలు చెప్పి, ఏడాది పరిపాలనలో మూడు బూటకపు ఎన్‌కౌంటర్లు చేయించి అమాయకులను మట్టుబెట్టారని హరీశ్ విరుచుకుపడ్డారు.

యూట్యూబ్ చానళ్లపై ఇదే తీరు..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యూట్యూబ్ చానళ్లను వాడుకొని గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు 'ఈ ట్యూబ్..ఆ ట్యూబ్' అంటూ వెక్కిరిస్తున్నాడని, ప్రశ్నిస్తే ఆరాచక చానళ్లు అంటూ అడ్డగోలుగా కేసులు పెడుతున్నారని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'టీవీల్లో రేవంత్ మాట్లాడుతూ కనిపించగానే పిల్లలు చెడిపోయే ప్రమాదమున్నదని తల్లిదండ్రులు చానళ్లు మార్చే దుస్థితి నెలకొన్నది' అని దెప్పిపొడిచారు. ప్రజలు ప్రతిదీ నిశితంగా గమనిస్తున్నారని, తగిన సమయంలో కచ్చితంగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

● మోకాళ్ల నడకతో వీఆర్ఏల నిరసన

గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన జీవో నంబర్ 81ను అమలు చేసి, తమకు న్యాయం చేయాలని వయసుమీరిన వీఆర్ఏలు, వారి వారసులు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియం ఎదుట వినూత్న నిరసన చేపట్టారు. మోకాళ్లపై నడుచుకుంటూ వచ్చి 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. - కరీంనగర్ కలెక్టరేట్

● కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల నిరసన

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే జరిగిన కుష్ఠు వ్యాధి (ఎల్‌సీడీసీ) సర్వేకు సంబంధించిన ఇన్సెంటివ్, మెటీరియల్ అందజేయకపోతే మరో సర్వే చేసేది లేదని ఆశ కార్యకర్తలు స్పష్టంచేశారు. ఈ మేరకు ఆశ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన తెలిపారు. - పెద్దపల్లి, నమస్తే తెలంగాణ

● ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నా

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదా బహిరంగ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలని ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం వారు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీఓవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు రాత్రిపూట గుట్టుగా డ్రోన్ల ద్వారా సర్వేలు చేస్తున్నారని మండిపడ్డారు. - చౌటుప్పల్

● కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్‌ల నిరసస

బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్‌లు నిరసన తెలిపారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులకు అప్పులు చేసి పనులను చేశామని, బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. - నిర్మల్ అర్బన్

● 'అంబుజా'ను రద్దు చేయాలని నిరసన

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను పూర్తి స్థాయిలో ఉపసహరించుకోవాలని పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు రామన్నపేటలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. - రామన్నపేట



తెలంగాణభవన్‌లో నిర్వహించిన మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆత్మీయ వీడ్కోలు సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు

మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ఘనవీడ్కోలు

- తెలంగాణభవన్‌లో అట్టహాసంగా కార్యక్రమం
- జీవితాంతం తెలంగాణకోసం తపించారు: మధుసూదనాచారి
- తెలంగాణకోసమే పార్టీలోకి వచ్చారు: హరీశ్‌రావు
- మాదిరెడ్డికి మాజీ మంత్రుల ఆత్మీయ సత్కారం
- తరలివచ్చిన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు



వీడ్కోలు సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తేతెలంగాణ): బీఆర్ఎస్ జనరల్ కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా సుదీర్ఘకాలం సేవలందించిన మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆత్మీయ వీడ్కోలు సభను సోమవారం తెలంగాణభవన్‌లో అట్టహాసంగా నిర్వహించారు. మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని పూలబొకెలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి తన జీవితాంతం తెలంగాణ కోసం పరితపించారని కొనియాడారు. కేసీఆర్ బీఆర్ఎస్ స్థాపించినప్పటి నుంచి అండగా ఉంటూ తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించారని గుర్తు చేసుకున్నారు. 'బాస్ ఈజ్ ఆల్వేస్ రైట్' అనే మాటకు కట్టుబడి ఉంటూ కేసీఆర్ బాటలో నడిచిన గొప్పవ్యక్తి అని ప్రశంసించారు. శ్రీనివాస్‌రెడ్డి ఎక్కడ ఉన్నా ఆయన మనస్సు కేసీఆర్, తెలంగాణ చుట్టూ పరిభ్రమిస్తుందంటూ కొనియాడారు. తెలంగాణభవన్‌పై చెరగని ముద్ర వేసిన ఆయన దూరంగా వెళ్తున్నారంటే గుండెల నిండా భారంగా అనిపిస్తోందని తెలిపారు. వినోద్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అనేక బాధ్యతలు నిర్వర్తించి బీఆర్ఎస్ అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి ఆయురారోగ్యాలతో నిండూ నూరేండ్లు జీవించాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్‌రెడ్డి జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మహమూద్‌అలీ ప్రశంసించారు. తాను ఉద్యోగ సంఘం ఏర్పాటు చేసినప్పుడు శ్రీనివాస్‌రెడ్డి తనను ఎంతగానో ప్రోత్సహించారని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేసుకున్నారు. పద్మారావుగౌడ్ మాట్లాడుతూ శీనన్నను కలవడానికి కచ్చితంగా అమెరికా వెళ్తానని చెప్పారు. ఆయన నిండూనూరేండ్లు ఆరోగ్యంగా సుఖసంతోషాలతో గడుపాలని అభిలాషించారు. శ్రీనివాస్‌రెడ్డితో తనకు మూడుతరాల అనుబంధమున్నదని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ వెనుకబడ్డ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి విద్యాధికుడిగా తమకు ఎనలేని గౌరవమన్నారు. కేసీఆర్‌ను నమ్ముకొని వస్తే మంచి భవిష్యత్ ఉంటదని తాను పార్టీలో చేరేందుకు మాదిరెడ్డి ఎంతగానో ప్రోత్సహించారని సత్యవతి రాథోడ్ గుర్తుచేసుకున్నారు. ఎర్రెబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబంతో చిన్నప్పటి నుంచి పరిచయం ఉన్నదని పేర్కొన్నారు. తాను సివిల్స్‌కు ఎంపికయ్యేందుకు శ్రీనివాస్‌రెడ్డి బోధించిన సబ్జెక్టే ఉపకరించిందని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గుర్తుచేసుకున్నారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎంతో ఇష్టపడే వ్యక్తి దూరంగా వెళ్లడం భారంగా ఉందని తెలిపారు. అన్ని వేళల్లో బాస్ ఏదంటే అదే అని చెప్పిన శ్రీనివాస్‌రెడ్డి నిరాహారదీక్షకు వెళ్లిన సందర్భంలో తనతో మాట్లాడుతూ అభ్యంతరం చెప్పారని జ్ఞాపకం చేసుకున్నారు.

తెలంగాణ కోసమే పార్టీలోకి వచ్చారు: హరీశ్‌రావు

తెలంగాణ అంటే గుర్తుకు వచ్చే పేరు కేసీఆర్‌ది అయితే తెలంగాణ భవన్ అంటే గుర్తుకు వచ్చే పేరు శ్రీనివాస్‌రెడ్డిదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రెండున్నర దశాబ్దాల ప్రస్థానంలో ఆయననోట ఏనాడు పరుషపదజాలం వినలేదని, ఓపిక, ప్రేమ, కమిట్‌మెంట్‌ను మాత్రమే చూశామని పేర్కొన్నారు. ఆయన పదవుల కోసం కాకుండా తెలంగాణ సాధన కోసమే వచ్చిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన ఇచ్చిన బీఫాంలతోనే ఎందరినో జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులుగా గెలిపించుకున్నామని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పడ్డ కష్టనష్టాలు, నాటి నుంచి నేటి వరకు ఎదురైన అడ్డంకులు, విజయాలతో ఓ పుస్తకం రాయాలని విజ్ఞప్తిచేశారు. ఆ పుస్తకాన్ని తెలంగాణ భవన్‌లో ఆవిష్కరించుకుందామని చెప్పారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. రెండున్నర దశాబ్దాలు కేసీఆర్‌తో కలిసి పనిచేయడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, మాణిక్‌రావు, చింత ప్రభాకర్, ఎమ్మెల్సీ వాణిదేవి, గోరెటి వెంకన్న, తాతా మధు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పద్మాదేవేందర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, వీజీ గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, దాసోజు శ్రవణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గ్యాదరి బాలమల్లు, వై.సతీశ్‌రెడ్డి, దేవీప్రసాద్, రాజీవ్ సాగర్, వాసుదేవరెడ్డి, ఆయాచితం శ్రీధర్, చిరుమల్ల రాకేశ్, కిశోర్‌గౌడ్, గెల్లు శ్రీనివాస్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్, మంత్రి శ్రీదేవి, సుమిత్రాఅనంద్ తదితరులు పాల్గొన్నారు.